# మినీకథలు

తర్వాత ఎలక్షన్లో తనకి ప్రచారం చేసింది. ఓటు కూడా వేసేవుంటుంది. అప్పట్లో ఆడ పిల్లలకి తవంటే కాస్త మోజు వుండేది.

ఆ మాట కొస్తే క్రిష్ణవేణి ఎన్ని సార్లు నోట్ఫులడగలేదూ? కాస్త చొరవ తీసుకుంటే ఓ తియ్యటి జ్ఞాపకం మిగిలి వుండేది."

సైకిల్ బెల్ వినిపించడంతో ఆలోచనలు చెదిరిపోయాయి.

మళ్ళీ సర్దుకుని నడుస్తూ "రాధకి బుద్ధి చెప్పటం ఎలా?" అని ఆలోచించ సాగేడు.

"అనవసరపు ఆలోచనలన్నీ వస్తాయి. ఈ మెదడు ఓ కోతి లాంటిది. రాధని తను ఇలాగే అన్నాడు. నీదో కోతి మొహం అని. "అందుకేగా మీకు నచ్చానూ" అంది. ఆ మాత్రం ధైర్యంగా మాట్లాళ్ళేకపోతే ఇంక పెళ్ళెందుకూ?

అనవసరంగా కోపం తెచ్చుకున్నా(. వెర్రి మనిషి అన్నం తిందో లేదో? ఏడుస్తూ కూర్చుని వుంటుంది. తన బ్రతుకు బర్దలై పోయిందనుకుని వుంటుంది. ఈ పెళ్ళితో తన గొంతుకోక్కాశారనుకుని ఛ.... ఛ.... ఏమో ఎవరు చెప్పగలరు?"

లంచ్ టైముదాకా ఎల్లాగో గడిపేశాడు. ఇంక ఏ పనీ తలకి పట్టలేదు. భరించలేక హాఫ్‌డే లీవు పెట్టేసి ఇంటిదారి పట్టాడు విజ్ఞానమూర్తి.

తలుపులు చప్పుడు కాకుండానెట్టి ఇంట్లో ప్రవేశించాడు. రాధ పెరట్లో వున్నట్లుంది.

"ఎంత నిర్లక్ష్యం. నా బదులు ఏ దొంగో వస్తే...." పళ్ళు నూరుకుంటూ చొక్కా విప్పబోయిన వాడల్లా ఆగిపోయాడు. టేబిల్ మీద ఓ కాయితం రెపరెపలాడుతోంది. దాని మీద పెన్ను ఎగరొద్దని బతిమాలుతోంది.

గబగబా ఆ కాయితం చూశాడు.

—ప్రియమైన శ్రీవారికి,

కోపం వచ్చింది కదూ? నేను.... అంతే రాసి వుంది. మధ్యలో ఆపేసి ఎందుకో బైటకెళ్ళింది కాబోలు.

మూర్తి మనస్సు కరిగిపోయింది. "పాపం బాధతో కుమిలిపోయి వుంటుంది. తనెంత నిర్దయగా వెళ్ళాడు ఆఫీసుకి. ఏడి చేడిచి...." అనుకుంటూ అప్రయత్నంగా తలగడాల్ని పరిశీలించి తృప్తిపడ్డాడు.

"ఛ. పెళ్ళాం అంటే ఓ బానిస అని నర నరాల్లోనూ జీర్ణించుకుపోయింది.... కుళ్ళు బుద్ధి...."

"రాధ రాగానే 'క్షమించు రాధా' అని దగ్గరకి తీసుకుందాం. నువ్వెలా వున్నావోననీ. కోపం వచ్చిందేమోననీ ఆఫీసరు ఎంత కోప్పడుతున్నాసరే వచ్చేశా. మెమో ఇస్తాడు. అంతేనా? నా రాధ ఆనందం ముందు అదో లెక్కా నాకు?

అన్నం కలిపి పెడితే మ్యాటినీకి వెళ్దామా? ఆఫీసుకు ఫైళ్ళమీద అక్షరాలు కనపడలేదు నువ్వే- నా మీద కోపం పోయిందా? తప్పు నాదే.... ఛ. నిన్ను నేను క్షమించటం ఏమిటి? నువ్వే నన్ను....నిజానికి నీమీద కోపం కాదు రాధా- ఏదో చిరాకు- అంతే. నవ్వవేం? ఛ కన్నీళ్ళెందుకు?

నా మనస్సుని బాధపెట్టావా? పిచ్చి రాధా ఎంత బేల మనస్సు నీది...."

తలుపు చప్పుడైంది. రాధ గుమ్మంలో నుంచుని "అప్పుడే వచ్చేశారా? ఏం ఒంటో ఎలా వుంది?" అంది.

విజ్ఞానమూర్తి గొంతు విప్పేలోగా మరో ఆసిలేషన్ పూర్తయింది. ఏదో పొర కప్పేసింది. గొంతుకేక్కడో అడ్డం పడింది. తల మరోవైపుకి తిరిగింది.

"తల నొప్పిగా వుంటే లీవు పెట్టి వచ్చేశాను. ఏం? ఆమాత్రం హక్కు కూడా లేదా నాకు?"

●

'మార్కెట్టుకెళ్ళి కూరలు తీసుకుని. అలాగే సామాను కూడా తీసుకురావాలిరా! బొత్తిగా అన్నీ నిండుకున్నాయి.' అంది అమ్మ.

"అబ్బ! నన్ను చంపకమ్మా! ఈ పార్ట్ టైమ్ జాబ్‌తో నిముషం ఖాళీలేక ఛస్తున్నాను. ఏదో ఓ అరగంట యింట్లో కూర్చుంటే నువ్విలాగ పన్లు చెబుతావు. ఏనా ఏ పద్మనో, వాసునో వెళ్ళనును. నేను మాత్రం వెళ్ళను" విసురుగా లేచాడు సత్యం.

"నే వెడతాలేరా! నీకు టైమవుతున్నట్లుంది. వెళ్ళి స్నానం చెయ్యి." అనునయించింది రేణుక తమ్ముణ్ణి.

మాట్లాడకుండా బాత్‌రూమ్‌లోకి నడిచాడు.

పది అవుతూండగా బయల్దేరి బస్‌స్టాప్‌కు చేరుకుంది రేణుక.

"తెల్ల చీర కట్టుకున్నదెవరికోసమూ, మల్లెపూలు పెట్టుకొని దెవరికోసమూ" ఆ గార్దభరాగాన్ని వినలేకపోతూంది రేణుక అలాగని చెవులు మూలుకుంటే వాడు మరీ రెచ్చిపోతాడు. అందుకని విననట్లు నటించినా వాడు పాడటం మానలేదు.

"ఖర్మ! కొనుక్కునే రెండు చీరలూ రంగుల్లో అయితే అందరికీ తెలిసిపోతాయనే



సామంచి కుసుమకుమారి

భయంతో తెల్లచీరలు కొనుక్కుంది. అది తప్పా?" విసుగ్గా అనుకుంది.

అంతలో బస్సు వచ్చింది. ఎలాగోలా ఎక్కి రాడ్ పట్టుకు నిలబడింది. భుజం మీద చెయ్యి పడటంతో విసురుగా తల తిప్పి చూసింది. భుజం మీద చెయ్యివేసిన వాడు కన్ను గీటుతూ "సారీ మేడమ్" అంటూ చేయి తీశాడు. 'ఛీఛీ వెధవలు' కనీసమైన సభ్యతా సంస్కారాల్లేని బ్రూట్స్' తిట్టుకుంది లోలోపలే రేణుక. అతను సరిగ్గా వెనుకనే నిలబడి స్పర్శా సుఖాన్ని అనుభవిస్తుంటే కారం రాసుకున్నట్లుంది రేణుకకు. ఏం చేయలేక నిస్సహాయంగా నిలబడిపోయింది. ఎలాగో మార్కెట్ రాగానే దిగిపోయింది.

కూరల ధరలు మండిపోతున్నాయి. తోటకూరకూడా పావలాకు తక్కువ లేదు. ఏం చెయ్యడం? కనీసం ఓ పూటైనా కూర లేనిదే ఎలా తినడం? ఆలోచన నుంచి తేరుకుని. ఏవో కూరలు తీసుకుంది. షాపుకెళ్ళి కావల్సిన సరకులన్నీ కొన్నది. బిల్ చూస్తే గుండె గుభేల్ మంది రేణుకకు. మూడు

వందల రూపాయలైంది బిల్.

సత్యం అంటూనే వుంటాడు. "నా కొచ్చేది నాల్గు వందల జీతం. నువ్వు అయిదు వందలు ఖర్చు చేస్తావ్. నే నెక్కడ నుంచి తేగలను? నాన్నగారు అప్పులు చేసేగా సంసారమిలా చేశారు? నేను చచ్చినా అప్పులు చేయలేను. కావాలంటే ఓ పూట పస్తుంటానండి- అంతేకాని...."

"దబ్బియ్యండమ్మా" అంటున్నాడు షాపువాడు.

పణుకుతున్న చేతులతో మూడువందలూ అందించింది. ఈ సరుకులన్నీ ఓ రిక్షాలో తీసుకెళ్ళాల్సిందే అనుకుని రిక్షా పిలిచింది.

"రెండ్రూపాయలివ్వండి" అన్నాడు రిక్షావాడు.

"రెండ్రూపాయలా? అసలా వీధి ఎక్కడుందో తెల్సా నీకు? రూపాయిస్తాను."

"ఎల్లండమ్మా? రూపాయిస్తారంట. మీరిచ్చే రూపాయికి కేజీ బియ్యం కూడా రావే" వాడు నిర్లక్ష్యంగా చెబుతున్నాడు.

అయితే నీకు కేజీ బియ్యం వచ్చేధర లెఖ్ఖ కట్టి యివ్వాలా ఎంత తక్కువ దూరమైనా?" కోపంగా అడిగింది రేణుక.

ఇదంతా చూస్తున్న షాపువాడన్నాడు- "ఎందుకమ్మా వాడితో గొడవ. వీళ్ళంతే! ఎల్లండి" అన్నాడు.

ఎండ మండిపోతూంది. ధరలూ మండిపోతున్నాయి.

చేసేదిలేక రిక్షాలో వచ్చింది రేణుక రెండు రూపాయిలిచ్చి.

"రేణూ! జీడిపప్పు, ఏలకులూ మర్చిపోయావే" అంది అమ్మ.

"రక్షించావ్! జీడిపప్పు ఎంత రేటులో ఉన్నాయో నీకు తెలీదంలేదూ? అయినా యిపుడవెందుకు?" అంది రేణుక.

"ఎల్లుండి సత్యం పుట్టినరోజే" అంది అమ్మ అమాయకంగా!

"చాల్లే పుట్టినరోజు పండుగలు కూడానా? అవి గొప్పవాళ్ళకి, ధనవంతులకి. మేమందరం చావకుండా బ్రతికి వున్నందుకు సంతోషించు. ఏదో ఆ నాల్గొందలయినా వాడు తెస్తున్నందువల్ల బ్రతికున్నాం. ఇంకా పుట్టిన రోజులూ, తద్దినాలూనూ" అంది విసుగ్గా.

"అయ్యో! ఆ అప్రాచ్యపు మాటలేమిటే!" నోరు నొక్కుకుంది అమ్మ. "రేణుకా!" వీధి గుమ్మంలో నుండి పిలుపు.

"ఓ రాధీ నువ్వా! రారా లోపలికి! బహుకాల దర్శనం. మంచి ఎండలో వచ్చావు. ఏమిటి విశేషం? మంచినీళ్ళు కావాలా?"ఆదరంగా అడిగింది రేణుక.


మంచినీళ్ళు తాగి బాగ్‌లోనుంచి శుభలేఖ అందించింది రాధిక.

శుభలేఖ విప్పి చూస్తూ "కంగ్రాచ్యులేషన్స్. ఇదేమిటి వరుడు సుబ్బారావా మరి శ్రీనివాస్? ఏమిటి సస్పెన్స్! లేకపోతే శ్రీనివాస్ పేరు మార్చుకున్నాడా?" రాధిక జీవంలేని నవ్వు నవ్వింది.

"సుబ్బారావే పెళ్ళికొడుకు— శ్రీనివాస్ కాదు" అంది నెమ్మదిగా.

"మరి మీ ప్రేమ...." ఆశ్చర్యంగా చూస్తూ అడిగింది.

"మా నాన్నేమన్నాడో తెల్సా- బ్రతకాలి అంటే ప్రేమ ఒక్కటే చాలదు రాధీ! డబ్బుండాలి. మొగాడికో ఉద్యోగం వుండాలి- అన్నాడు. మా నాన్న దృష్టిలో పెళ్ళికాని ఆడది, ఉద్యోగం లేని మగాడూ ఒక్కటే. ఆడదానికి పెళ్ళికాకపోవడానికి



కారణం అదృష్టమైతే, మగాడికి ఉద్యోగం రాకపోవడానికి అసమర్థతే కారణంట. సో, శ్రీను డిగ్రీ సంపాదించుకున్న రెండు సంవత్సరాలకు కూడా బ్రతకడానికో అర్హత సంపాదించుకోలేకపోయాడు. 'ఇంకో రెండు సంవత్సరాలకైనా వాడికి ఉద్యోగం వస్తుందని నమ్మకం ఏమిటి?' అని వాదించారు నాన్నగారు." రాధీ దీర్ఘంగా నిట్టూర్చింది.

"అందరికీ ఒకటే సమస్య- బ్రతకడం తరువాతే మిగిలినవన్నీను. ప్రేమలూ, ఆశయాలూ, ఆదర్శాలూ. ఎందువల్ల యిలా అవుతోంది? యిందులో తప్పెవరిదీ"— ఆలోచిస్తూ అలాగే ఉండిపోయింది రేణుక.

*　　*　　*

ఆకాశంలో నక్షత్రాలు కన్నెపిల్ల కోరికల్లా మెరుస్తున్నాయి. నీలాకాశం నిరుద్యోగి ముఖంలో నిరాశలా వుంది. చల్లగాలి వీస్తోంది. బ్రతుకు భారాన్ని నెమ్మదిగా మోస్తున్న సగటు మనిషిలా వున్నాడు చంద్రుడు.

ఆలోచనలలో మునిగిన రేణుక ఉలిక్కిపడింది.

"సత్యం రాలేదేమిటే?" ఎదురుగా అమ్మ.

"వచ్చాడు. పడుకున్నాడు. అమ్మా! నీతో మాట్లాడాలి యిలా కూర్చో!" అన్నది రేణుక. ఆవిడ ఆత్రుతగా అక్కడే చతికిలపడింది.

"సత్యం పెళ్ళి చేసుకున్నాడు. తెల్సా?" అన్నది నెమ్మదిగా రేణుక.

"ఆవిడకు నెత్తిన పిడుగు పడ్డట్టయింది.

"అదేమిటే! నిజమేనా? అయినా నీకు పెళ్ళి కాకుండానే! ఎవరికీ తెలియకుండా ఎలా చేసుకున్నాడు? కట్న కానుకల్లేకుండా ఎలా చేసుకున్నాడు? నేనింకా బ్రతికున్నాను గదటే" బాధగా సన్నగా ఏడుస్తూ అంది అమ్మ.

"నువ్వు ఏడుపు ఆపి నే చెప్పేది విను. నాలాటి ఓ ఆడపిల్ల కన్నెచెర వదిలించాడని సంతోషించు. కట్న కానుకలంటావా? నా పెళ్ళి కట్న కానుక లివ్వలేకనేగదా అవడంలేదు? అదే సమస్య వాళ్ళకూ కల్గించడమేం న్యాయం? వాళ్ళూ మనలాగే స్తోమతు లేనివాళ్ళయి వుంటారు. అందుకని ఆ అమ్మాయిని సాధించకు. నా పెళ్ళి తమ్ముడిలాగే ఎవరో ఒకరు ముందుకువస్తే తప్ప అవదు. వాడికీ వయసేం తక్కువ లేదు. ఇంకోలా బయట పడకుండా పెళ్ళి చేసుకున్నందుకు సంతోషించు. ఇంకా మనకు వాడు గౌరవమిస్తున్నందుకే, కనీసం పెళ్ళి చేసుకున్నానని చెప్పాడు. వాడు మనతో ఎప్పటిలా వుండాలంటే వాడు పెళ్ళాన్ని తీసుకుని వేరే వెళ్ళకుండా ఉండాలంటే ఏమీ మాట్లాడకు. వాణ్ని ఆశీర్వదించు. రాత్రి నాకంతా చెబుతూ తప్పు చేసినట్లు ముఖం దాచుకున్నాడు. వాణ్ని చూస్తే జాలేసింది. వాడు చేసిన పనిలో తప్పులేదు. కొన్ని సమస్యలకు పరిష్కారం ఉండదు. వాటితో రాజీ పడగల్గినప్పుడే రవ్వంత సుఖం"అంది నచ్చచెబుతూ.

*　　*　　*

మర్నాడు గుమ్మానికి మామిడికొమ్మలు పెడ్తూ అంది రేణుక. "ఇవాళ ఆ అమ్మాయిని తీసుకురారా!"

సత్యం సిగ్గుపడ్తూనే నవ్వాడు సంతోషంగా. సత్యం ముఖంలో సంతోషం వెన్నెల రేఖలా ఉంది.


## శుభవార్త



తలనొప్పి, కడుపునొప్పి, చర్మ వ్యాధులు, నరాల బలహీనత, ఫిట్సు, కీళ్ల ముట్టుకుట్టు నొప్పి, సుఖ వ్యాధులు, మూత్ర వ్యాధులు, చెక్కెర వ్యాధి, మూలశంక, పిల్లలు లేకపోవుట, దాంపత్య సుఖ లోపం మొదలైన వ్యాధులను, మా వైద్యశాల ప్రధాన వైద్యులు డాక్టర్ ఎన్. ఎస్. రావుగారు నాడీ పరీక్షతో వైద్యం చేయుదురు.

పరీక్ష ఫీజు రు. 15/– వ్యాధినిబట్టి చికిత్సకు చార్జి చేయుదురు. మందులు వారే ఇస్తారు.

N. B. : పేదల వైద్యము నెలకు రు. 15/–. రెండు మాసముల మందు ఒకేసారి తీసుకొనవచ్చును.

క్యాంపుల వివరం : ఫిబ్రవరి, ఏప్రిల్, జూన్ నెలలలో

హైదరాబాద్ : ప్రతి నెల 1, 2, 3 తేదీలు : జయా లాడ్జి, కోటి
మహబూబ్‌నగర్ : 4వ తేదీ : గణేష్ భవన్.
కర్నూలు : 5వ తేదీ : ఉడిపి హోటల్(పెద్ద మార్కెట్‌వద్ద).
గుంతకల్ : 6 వ తేది : శ్రీ లాడ్జి.
కడప : 7 వ తేది : ద్వారకా లాడ్జి.
తిరుపతి : 8 వ తేది : హోటల్ విక్రం, R.T.C. బస్ స్టాండ్ ఎదుట.
మద్రాసు : 9, 10 తేదీలు : కోమల విలాస్, నెం. 12, ఫ్రాన్సిస్ జోసఫ్ స్ట్రీట్, (జి. టి.). హైకోర్టు ఎదురుగా.
నెల్లూరు : 11 వ తేది : రాఘవ విహార్.
గుంటూరు : 12 వ తేది : ఉడిపి శ్రీకృష్ణ భవన్, (స్టేషన్ రోడ్)
రాజమండ్రి : 13, 14 తేదీలు : కాంతి నివాస్.
కాకినాడ : 15 వ తేదీ : ద్వారకా లాడ్జి.
వైజాగ్ : 16, 17 తేదీలు : బృందావన్ లాడ్జి (డాబా గార్డెన్స్).
విజయవాడ : 18 వ తేది : మాడరన్ కేఫ్, గాంధినగర్.
ఖమ్మం : 19 వ తేది : మయూర్ కేఫ్ (శేషమహల్ లాడ్జి).
వరంగల్ : 20 వ తేది : హోటల్ నటరాజ్.
హైదరాబాద్ : 21 వ తేది నుండి హెడ్డాఫీసు,

సంప్రదించు కాలము : ఉ. 7 గంటల నుండి సా. 4 గంటల వరకు * నిరుద్యోగులకు, ఉద్యోగులకు శుభవార్త : పై సెంటర్సులో స్త్రీలు, పురుషులు ఏజంట్సుగా పనిచేసి, నెలకు రూ. 500 లు నుండి రూ. 1000 ల వరకు సంపాదించండి. డాక్టరును సంప్రదించండి.

ఎన్. ఎస్. రావూస క్లినిక్, ప్లాట్ నెం. 471, జూబిలి హిల్స్, రోడ్ నెం. 36, హైదరాబాద్ – 500 034.